PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 255 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 09 సెప్టెంబర్ 2026

### తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి!




### మండల కేంద్రం హోదా ఉన్నా.. బస్టాండ్ సౌకర్యం కరువు!




# కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్



- ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు
- అడ్డుకున్న పోలీసులు..?మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా
- కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
- రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు
- పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు,
- తదితరులు..సాయంత్రానికి విడుదల
- పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు

**హైదరాబాద్: సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హోస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**భారీగా పోలీసుల మోహరింపు**

కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

**గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత**

కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న మిగతా2లో...




# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

- ఆవేశం మీకు కాదు.. నాకుండాలి హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం ?చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ్
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి
- శాసన సభలోవాడీ వేడి చర్చ

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**హైదరాబాద్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రా ల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారులు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి




## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

● సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు ● ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం




## స్పీకర్‌ను పరామర్శించిన సీఎం రేవంత్..




## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




## తెలంగాణలో 17 మంది డీఎస్పీల బదిలీ



# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. " కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు. ఒకవైపు మహిళలపై జరిగిన ఘటనపై విచారణ కోరుతూ.. మరోవైపు స్పీకర్‌పై వ్యాఖ్యలను సమర్థించడం ఏ న్యాయం?అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో అణగారిన వర్గాల ప్రజలు కూడా ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందా?అని ప్రశ్నించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. దళిత సంఘాలు, ప్రజాసంఘాలు స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నాయని గుర్తు చేశారు. ఇదే అంశంపై ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యే అనురిద్‌రెడ్డి మాట్లాడారు.బీజేపీ సభ్యులు 22ఏపై చర్చించాలని పట్టుబట్టారు. ప్రజా సమస్యలు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోడియం ముందు బైటాయించారు. మంత్రి జోక్యం చేసుకుని ఆ అంశంపై ప్రత్యేక చర్చ ఉందని చెప్పారు. వారు, వీరు కలిసి లోపాయికారి ఒప్పందంతో స్పీకర్‌పై జరిగిన దాడిని పక్కదారి పట్టిస్తున్నారనిబీజేపీసభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

---

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**హైదరాబాద్,సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

---

## కేసీఆర్ హత్యకు

# కుట్రలు : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు. **కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత** ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు.హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

**ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్** ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

**పాలక పక్షానికి.. ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలా? : హరీశ్‌రావు** పాలక పక్షానికి, ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలు ఉన్నాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకులను ఎర్రవెల్లి వెళ్లకుండా అడ్డుకుంటూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మాత్రం అనుమతిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసే హక్కు తమకు ఉందని, ఎర్రవెల్లి వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులతో ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి నాయకులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు.

---

## స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**హైదరాబాద్: సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామీనిచ్చారు.

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**హైదరాబాద్,సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026


**హైదరాబాద్,సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: సజ్జనార్



**హైదరాబాద్,సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్వాహకులు పోలీస్‌పోర్టల్. టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ ఇన్‌డెక్స్. హెచ్‌టిఎం పోర్టల్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం అందించి హైదరాబాద్ సిటీ పోలీస్ కు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తగిన భద్రతాను పోలీసులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

## తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



**హైదరాబాద్,సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర పోలీసు శాఖలో 17 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)లకు బదిలీలు, పోస్టింగులు కల్పిస్తూ డిజిపి సి.వి ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్‌పి కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసిపిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.జీ. శివశంకర్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.ఎస్‌కె. అబ్దుల్ రహ్మాన్‌ను జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా నియమించారు. ఏ. రవి కుమార్‌ను జగిత్యాల డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజిపి కార్యాలయంలోని డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. జె. వెంకటేశ్వర్‌రావును మెదక్ డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా, బి. కిషన్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎల్. రమేశ్ కుమార్‌ను హైదరాబాద్ సిటీ సిటిసి ఏసిపిగా నియమించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డికిసంగారెడ్డి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు.కదరు వెంకట్‌రెడ్డిని టిజిపిఏ డిఎస్‌పిగా నియమించారు. కొమట్ల సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్. సుదర్శన్‌ని హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా నియమించారు. ఎన్. శంకర్‌కుహైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. పీ. విజయ్ కుమార్‌ను వెస్ట్ జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. కె. భాస్కర్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎం. వెంకట నర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా నియమించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన అధికారులు తమ రిలీవ్ అనంతరం వెంటనే విధుల్లో చేరి, సంబంధిత ఉన్నతాధికారులకు ఛార్జ్ రిపోర్టులు సమర్పించాలని డిజిపి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి!

**దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం.. మహిళా పోలీసుల పట్ల అనుచిత ప్రవర్తన**

**అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపైనా ఉంది**

**మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి**



**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ వద్ద అనుచితంగా ప్రవర్తించి, దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం ఉపయోగించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే బర్తరఫ్ చేయాలని మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మల్లంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే అసెంబ్లీ ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుచితంగా ప్రవర్తించడం, దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం ఉపయోగించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. **మహిళా పోలీసుల పట్ల అనుచిత ప్రవర్తనపై ఆగ్రహం** అసెంబ్లీ వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తించడం ఏమాత్రం సమర్థనీయం కాదని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజలకు దూరంగా.. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరుపైనా శ్రీకాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన బాధ్యత కలిగిన నాయకులు సభకు దూరంగా ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ జిల్లా అధ్యక్షులు ఆనందపు రవిబాబు, మల్లంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు పొనుగోటి రవీందర్, వనమా శ్రీనివాస్, కక్కెర్ల సాంబయ్య, లక్ష్మణ్, జింక వేణు, మహేందర్, చంద్రమౌళి, కావటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేంసూరులో బీఆర్ఎస్ పోరుబాట

**కాంగ్రెస్ ప్రభుత్వంపై సండ్ర వెంకట వీరయ్య ఫైర్**

**అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పై జరిగిన ప్రభుత్వ దాడిని ఖండిస్తూ నిరసనగా భారీ ర్యాలీ**







**వేంసూరు, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పై జరిగిన ప్రభుత్వ దాడిని ఖండిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడు పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపు నిచ్చినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ శాసనసభ, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని, స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని సండ్ర అన్నారు. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపిన సందర్భాలను ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు నల్ల దుస్తులతో నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ నేతలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్నది బీఆర్ఎస్ ఆరోపణ కాగా, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సండ్ర డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని సండ్ర విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్లు వంటి హామీలను నెరవేర్చాలని కోరారు. రైతు భరోసా, రైతు బీమా, యూరియా సమస్యలపై కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు సహా అన్ని వర్గాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యలు, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం ఇక్కడితో ముగియదని.. మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరసనకు తరలివచ్చిన మహిళలు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలకు సంబంధించి న పలు వినతిపత్రాలను అధికారులకు సమర్పించారు.

# మండల కేంద్రం హోదా ఉన్నా.. బస్టాండ్ సౌకర్యం కరువు!

**● నాలుగు నియోజకవర్గాలకు కూడలిగా మల్లంపల్లి.. ప్రయాణికులకు మాత్రం తప్పని ఎదురుచూపులు ● ఎక్కడ బస్సు ఆగుతుందో తెలియని దుస్థితి.. రోడ్లపైనే నిరీక్షణ ● మహిళలు, వృద్ధులు, చిన్నారుల అవస్థలు.. ప్రమాదాల ముప్పు**

**● మండల కేంద్రానికి తగిన రవాణా సదుపాయాలు కల్పించాలని ప్రజల డిమాండ్**





**మల్లంపల్లి మండల ప్రతినిధి నవంబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంగా రూపుదిద్దుకుంటూ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతున్న మల్లంపల్లికి రవాణా కష్టాలు మాత్రం వీడటం లేదు. మండలం ఏర్పడి అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నప్పటికీ.. ప్రయాణికుల మౌలిక వసతుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. ముఖ్యంగా ప్రత్యేక బస్టాండ్ లేకపోవడం మల్లంపల్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు మల్లంపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నా బస్సులు నిలిచేందుకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో ఎక్కడ బస్సు ఆగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి ఒక్కో ప్రాంతంలో బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు రోడ్ల వెంబడి పరుగులు తీయాల్సి వస్తోంది. ఎండైనా.. వర్షమైనా.. బస్సు కోసం రోడ్డు పక్కనే నిలబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. **నాలుగు నియోజకవర్గాలకు కూడలి** మల్లంపల్లి భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రాంతంలో ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రధాన రాకపోకల కేంద్రంగా మారుతోంది. నర్సంపేట, ములుగు, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల ప్రజలకు మల్లంపల్లి ఒక కీలక కూడలిగా నిలుస్తోంది. విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలు, ప్రభుత్వ కార్యాలయాల పనులు, నిత్యావసరాల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు మల్లంపల్లికి వస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో ఈ ప్రాంతానికి రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రవాణా వసతులు మాత్రం మెరుగుపడకపోవడం స్థానికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. **ఎక్కడ బస్సు ఆగుతుందో తెలియదు!** ప్రత్యేక బస్టాండ్ లేకపోవడంతో మల్లంపల్లిలో బస్సుల నిలిపివేతకు ఇప్పటికీ నిర్దిష్టమైన ప్రదేశం లేకుండా పోయింది. దీంతో ప్రయాణికులు బస్సు కోసం రోడ్డు పక్కన నిలబడి ఎదురుచూడాల్సి వస్తోంది. బస్సు వస్తున్నట్లు కనిపించగానే అది ఎక్కడ ఆగుతుందో తెలియక ప్రయాణికులు ముందుకు, వెనక్కు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి తొలిసారిగా మల్లంపల్లికి వచ్చే వారికి ఈ సమస్య మరింత తీవ్రంగా ఎదురవుతోంది. బస్సులు రోడ్డుపైనే ఆగడం.. ప్రయాణికులు కూడా రోడ్డుపైనే నిలబడటంతో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాల భయం నెలకొంటోంది. బస్సు ఎక్కే సమయంలోనూ, దిగే సమయంలోనూ ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. **మహిళలు, వృద్ధుల పాట్లు వర్ణనాతీతం** బస్టాండ్ లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో ప్రయాణించే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలోనూ, వర్షంలోనూ రోడ్డుపక్కనే నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. గంటల తరబడి వేచి చూసినా కూర్చునేందుకు కనీస సౌకర్యాలు లేక వృద్ధులు అవస్థలు పడుతున్నారు. చిన్నపిల్లలతో వచ్చే మహిళలకు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రయాణికుల కోసం షెల్టర్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో బస్సు కోసం ఎదురుచూడటం వారికి ఒక పరీక్షగా మారుతోంది. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక వేచి ఉండే ప్రదేశం, మరుగుదొడ్లు లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. **వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణం** వర్షాకాలంలో ప్రయాణికుల కష్టాలు రెట్టింపవుతున్నాయి. బస్సు కోసం వేచి ఉండేందుకు సరైన షెల్టర్ లేకపోవడంతో వర్షంలో తడుస్తూనే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. మరోవైపు ఎండాకాలంలో ఎండ తీవ్రతను తట్టుకుంటూ రోడ్డు పక్కనే నిలబడాల్సి వస్తోంది. మల్లంపల్లి అభివృద్ధి వేగానికి అనుగుణంగా రవాణా మౌలిక వసతులను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుని మల్లంపల్లి ప్రయాణికుల దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కల్లూరులో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దగ్ధం





**కల్లూరు, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖలను కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మెయిన్ రోడ్డుపై ఎమ్మెల్సీ తాత మధు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దుచేసి ఎస్సీ ఎస్టీ ఆక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కల్లూరు పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోట్రూ అర్జున్ రావు, మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, టౌన్ కమిటీ అధ్యక్షుడు ఎస్.కె ఉస్మాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ భాగం నీరజ దేవి, నాయకులు శీలం కృష్ణారెడ్డి, ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, పెద్దబోయన శ్రీనివాసరావు, భాగం ప్రభాకర్ చౌదరి, ఆళ్లకుంట నరసింహారావు, యాస శ్రీకాంత్, భూక్య శివ నాయక్, జిల్లెల్ల భాస్కర్ రెడ్డి, బైర్ల కాంతారావు, మట్ట రామకృష్ణ, ఏనుగు సత్యంబాబు, పేరువంచ సర్పంచి కీసర నిర్మల మోహన్ రెడ్డి, చిన్న కోరుకొండి గ్రామ సర్పంచ్ భూదాటి గీతా నర్సిరెడ్డి, శిరసాని జమలయ్య, కే వెంకటేశ్వరావు( కె.వి), బోల్లెపోగు రవి, దామాల సురేష్, మేకల రవి, పుల్లయ్యా, రేపాకుల రామకృష్ణ, కాటేపల్లి కిరణ్ కుమార్, నాగబత్తిన నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ వెరిఫికేషన్ నిలిపివేయాలి: ములుగు రైస్ మిల్లర్లు

**సార్టెక్స్, నిల్వలతో వచ్చే వేరియేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలి**

**అక్టోబర్ 30 వరకు మిల్లింగ్, బియ్యం డెలివరీలకు గడువు ఇవ్వాలి**

**పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల బకాయిలు చెల్లించాలి**

**సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం**

**కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసిన రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్**






**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యు న్యూస్):** కేఎంఎస్ 202526 ఫ్రెష్ సీజన్ వెరిఫికేషన్‌లో భాగంగా చేపడుతున్న ఫిజికల్ వెరిఫికేషన్‌ను నిలిపివేయాలని ములుగు జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ములుగులో నిర్వహించిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ.. షార్ట్‌ఫాల్ వస్తే 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీ విధించడం వల్ల మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. సార్టెక్స్, దీర్ఘకాలిక నిల్వల కారణంగా ధాన్యంలో 10 శాతం వరకు వేరియేషన్ వస్తోం దని, తేమ, బరువు తగ్గడం, డిస్‌కలర్, డ్యామేజ్‌ను వెరిఫికేషన్‌లో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. నష్టపోయిన ధాన్యాన్ని లిక్కర్, ఇథనాల్ పరిశ్రమలకు విక్రయిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 30 వరకు మిల్లింగ్, బియ్యం డెలివరీలకు అవకాశం కల్పించాలని, గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, డ్రైయేజ్, కస్టోడియన్, రవాణా ఛార్జీల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మిల్లర్లను వ్యతిరేకులుగా కాకుండా భాగస్వాములుగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఫిజికల్ వెరిఫికేషన్ నిలిపివే యకపోతే మిల్లింగ్, బియ్యం డెలివరీలు నిలిపివేసి సమ్మెకు దిగుతామని రైస్ మిల్లర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే రైస్ మిల్లులు మూతపడే పరిస్థితి వస్తుందని తెలిపారు. అనంతరం రైస్ మిల్లర్లతో కలిసి బాదం ప్రవీణ్ ములుగు కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

# చిలకనగర్‌లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలి**

**ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాలి: పంగ ప్రణయ్ కుమార్ మాదిగ**



**ఉప్పల్, సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉప్పల్ మండలం చిలకనగర్ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉప్పల్ మండల ఇంచార్జి కోరపాక అంజి మాదిగ అధ్యక్షతన, సీనియర్ నాయకులు అంతగాళ్ల అశోక్ మాదిగ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షీరాం ఆశయాల సాధనకు కృషి చేస్తూ ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీగా అధ్యక్షుడిగా జెర్రిపోతుల బాలకిషన్ మాదిగ, అధికార ప్రతినిధిగా పొట్ట వినోద్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కానుకుంట్ల అనిల్, ఉపాధ్యక్షుడిగా గంధమల్ల నరేష్, కోశాధికారిగా పానుగంటి నాగరాజు, సహాయ కార్యదర్శిగా యెర్ర రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, యువత పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి.. విద్య ప్రతి ఒక్కరి హక్కు

- నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం
- ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ర్యాలీ







**కల్లూరు, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి కలుగుతుందని విద్య ప్రతి ఒక్కరి హక్కు అని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. నిరక్షరాస్యత నిర్మూలము లక్ష్యంగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని ఎంపీడీవో చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు అక్షరాస్యత ప్రాధాన్యతను తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చదువు అందించడం ద్వారా వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. అక్షరాస్యత అనేది కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాకుండా, వ్యక్తికి తన హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించే సాధనమన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించి సమాజంలోని ప్రతి ఒక్కరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 14 వరకు అక్షరాస్యత పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అక్షరాస్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యతోనే సమాజంలో మార్పు, సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పద్మ, ఏపీఎం అశోక రాణి, ఉపాధ్యాయులు, సీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సంగేపు అనిరా ఆలివ్‌కు స్వర్ణం

**- టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో మెరిసిన ఏడేళ్ల బాలిక**




**హైదరాబాద్, సెప్టెంబర్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన 'టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్2026' పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం (సెప్టెంబర్ 6న) నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఏడేళ్ల బాలిక సంగేపు అనిరా ఆలివ్స్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అనిరా తనదైన ప్రత్యేక శైలి, నైపుణ్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లోనూ అనిరా ఆలివ్స్ రెండు పతకాలు గెలుచుకుని తన సత్తా చాటింది. ఇంత చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రెండు పతకాలు, తాజాగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణం సాధించి వరుస విజయాలతో దూసుకుపోతుండటం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కోచ్ కిరణ్ మాట్లాడుతూ.. అనిరా ఆలివ్స్ చూపే క్రమశిక్షణ, క్రీడ పట్ల ఆమెకున్న అంకితభావమే ఈ విజయానికి కారణమని కొనియాడారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ఆమె తన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుందని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మరిన్ని పతకాలు సాధించే సత్తా ఆమెకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్న ఈ జాతీయ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, సినీ నటుడు, 8వ డాన్ బ్లాక్ బెల్ట్ డా. సుమన్ తల్వార్, టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు శిహాన్ గ్రాండ్ మాస్టర్ డా. పి. అశోక్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. స్వర్ణ పతకం సాధించిన అనిరా ఆలివ్స్‌ను అతిథులతో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

# భాగ్యవతి యాదవ్ మరణం తీరని లోటు: జక్కుల ప్రభాకర్ యాదవ్

**- నేడు నారాయణగూడ వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో సంతాప సభ**



**నారాయణగూడ, సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ సంఘ సేవకురాలు జక్కుల భాగ్యవతి యాదవ్ అకాల మరణం సమాజానికి తీరని లోటని జక్కుల ప్రభాకర్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా మీడియా జాయింట్ కన్వీనర్ జక్కుల మహేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భాగ్యవతి యాదవ్ తన జీవితకాలంలో పేద ప్రజల సంక్షేమం, కుటుంబాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సమాజ సేవలో ముందుండే ఆమె నేడు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె స్మారకార్థం బుధవారం మధ్యాహ్నం 1:00 గంటకు నారాయణగూడలోని వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సంతాప సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలతో సభ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో జే. సంతోష్ కుమార్ యాదవ్, జే. పవనిత యాదవ్, జే. ఉమామహేశ్వరి యాదవ్, శ్రీరామ్ యాదవ్, పద్మజ యాదవ్, లాస్య శ్రీ యాదవ్, చోళ సుధాకర్ యాదవ్, హేమంత్ యాదవ్, చోళ వనశ్రీ యాదవ్, సి. సుధాకర్ యాదవ్, ఐశ్వర్య యాదవ్, సర్విక యాదవ్, ఆకాష్ నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ-సేవా కేంద్రాల్లో అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు

**పౌరులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించాలి**

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ములుగు జిల్లా**




**ములుగు జిల్లా సెప్టెంబర్08( పి సి డబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలోని మీ-సేవా కేంద్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలను అందించాలని శ్రీ సిహెచ్. మహేందర్ జీ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ములుగు గారు, మీ-సేవా నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో స్పష్టం చేశారు. మీ-సేవ సేవల పేరుతో ప్రభుత్వం నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేయడం, అనధికార మధ్యవర్తిత్వానికి పాల్పడటం, ప్రజల నుంచి అధిక మొత్తాలను వసూలు చేయడం వంటి చర్యలను ఇకపై ఏమాత్రం సహించబోమని ఆయన హెచ్చరించారు.

**ఫిర్యాదు వస్తే విచారణ నిరూపితమైతే శాశ్వత రద్దు:** మీ-సేవా కేంద్రంపై అధిక రుసుముల వసూళ్లు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ములుగు తెలిపారు. విచారణ సమయంలో అవసరమైతే సంబంధిత కేంద్రాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తామని, ఆరోపణలు నిజమని తేలితే మీ-సేవా ఫ్రాంచైజీ/అనుమతిని శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల పట్ల దురుసు ప్రవర్తన లేదా అనుచిత ప్రవర్తనకు సంబంధించి పునరావృత ఫిర్యాదులు వచ్చినట్లయితే వాటిని తీవ్రంగా పరిగణించి, తగిన చర్యలు తీసుకోబడతాయి. మీసేవ కేంద్రాన్ని సాంకేతిక లేదా వ్యతిగతమైన కారణాల వలన తాత్కాలికంగా లేదా శాశ్వతంగా మూసివేయాల్సి వస్తే ముందస్తుగా జిల్లా పరిపాలనకు సమాచారం అందించాలి. లఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపర్డెంట్ శివకుమార్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మరియు మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ మరియు ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

**పునరుద్ధరించిన సోమసూత్రాన్ని పరిశీలించిన రామాల సునీత**

**ఆలయ అభివృద్ధి, నిర్వహణపై అధికారులతో సమీక్ష**





**ములుగు జిల్లా వెంకటాపూర్, సెప్టెంబర్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో కొలువుదీరిన చారిత్రక రామప్ప దేవాలయాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత రామప్ప రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆమె, ఆలయ నిర్వహణ, భక్తులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండు రోజుల క్రితం పునరుద్ధరించిన సోమసూత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించారు. చారిత్రక కట్టడమైన రామప్ప ఆలయ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న పునరుద్ధరణ పనుల వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాచీన నిర్మాణాలు, శిల్పకళకు ఎలాంటి నష్టం కలగకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులు, పర్యాటకులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ఆలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఇమ్మడి భాస్కర్, టూరిజం గైడ్ వెంకటేష్, టూరిస్ట్ పోలీసులు, దేవాదాయ శాఖ, పురావస్తు శాఖ, టూరిజం శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న గంగిపల్లి వాసి రంగు మౌనిక...




**మానకొండూర్ సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ మండల కేంద్రంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన పూసాల శరత్ సతీమణి రంగు మౌనిక న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆమె ఈ డాక్టరేట్ అందుకున్నారు. 2015లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన మౌనిక, 2016లో నల్సార్ విశ్వవిద్యాలయం నుండి ఎల్ఎల్ఎం పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లా కళాశాల సీనియర్ ప్రొఫెసర్ జి.బి. రెడ్డి పర్యవేక్షణలో "బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ హైదరాబాద్ సిటీ: ఎ లీగల్ స్టడీ" అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనా పత్రానికి విశ్వవిద్యాలయం పీహెచ్‌డీని ప్రదానం చేసింది. న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం పట్ల రంగు మౌనికను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల తో పాటు గంగిపల్లి సర్పంచ్ వాల ప్రదీప్ రావు, మాజీ ఎంపీటీసీ రంగు భాస్కరాచారి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

# వీధి వ్యాపారులకు అండగా ఉచితంగా ఎగ్ కార్టుల పంపిణీ..

**- ఎగ్ కార్టులను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని వీధి వ్యాపారులను ప్రోత్సహిస్తూ, వారికి మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెప్మా ఆధ్వర్యంలో ఎగ్ కార్టుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించి, ఎగ్ కార్టులను ఆవిష్కరించారు. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని వీధి వ్యాపారుల్లో గుడ్లతో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్న వారిని గుర్తించి, ప్రభుత్వం ద్వారా మంజూరైన ఎగ్ కార్టులను అర్హులైన లబ్ధిదారులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎగ్‌తో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఆధునిక ఎగ్ కార్టుల ద్వారా వీధి వ్యాపారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, వారి వ్యాపార కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, వీధి వ్యాపారులు నగర ఆర్థిక వ్యవస్థలో కీలక భాగమని అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారికి అవసరమైన సహకారం అందిస్తూ, ఆర్థికంగా స్వయంపోషకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. వీధి వ్యాపారులకు మెరుగైన వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్, గౌరవ కార్పొరేటర్లు, మెప్మా టీఎంసీలు, సీఓలు, మెప్మా సిబ్బంది, ఎగ్ కార్ట్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నేను చెప్పిందే వేదం..నా మాటే శాసనం’

**ఇష్టారాజ్యంగా ములుగు డీటీవో ఈశ్వర్ సింగ్ విధులు**

**యూనిఫాం పక్కన పెట్టి బనీన్‌పైనే డ్యూటీ**


**ఇప్పటికే సార్‌పై అవినీతి ఆరోపణల వెల్లువ**

**సెలవు రోజుల్లోనూ సార్ సైన్‌తో లైసెన్స్, సర్టిఫికెట్లు జారీ**

**డ్రైవింగ్ టెస్టులోనూ ‘ముడుపులు’ ఇస్తేనే పాస్?**

**రవాణా శాఖ అధికారి తీరుపై విమర్శలు**



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయం పెద్ద సారు నేను చెప్పిందే వేదం, నా మాట వినకుంటే బతుకులు చిద్రమే అన్న తీరుగా వ్యవహరిస్తూ కార్యాలయంలో అర్ధనగ్నంగా డ్యూటీ చేయడం అటు కార్యాలయ సిబ్బంది లోను, ఇటు వాహనదారుల నుండి తీవ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు జరుగుతున్నాయంటూ దరఖాస్తుదారులు, వాహనదారులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ వ్యవహారశైలిపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. **బ్రోకర్లను కలిస్తేనే పని ముందుకు?** ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనల ప్రకారం దరఖాస్తుల పరిశీలన జరగాల్సి ఉంటుంది. అవసరమైన పత్రాలు సక్రమంగా లేకుంటే సంబంధిత అధికారులు వాటిని తిరస్కరించడం లేదా లోపాలను సరిచేయాలని సూచించడం సాధారణ ప్రక్రియ. అయితే ములుగు కార్యాలయంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో తమకు అనుకూలంగా ఏర్పాటు చేసుకున్న బ్రోకర్లను ఆశ్రయిస్తేనే పనులు సులభంగా పూర్తవుతున్నాయని, లేదంటే దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని వారు చెబుతున్నారు. సరైన పత్రాలు లేని దరఖాస్తులను సైతం ముందుకు తీసుకెళ్లాలని కింది స్థాయి సిబ్బందిపై డి టి ఓ ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. **సిబ్బందిపై ఒత్తిళ్లంటూ ఆరోపణలు** నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను తిరస్కరించే కింది స్థాయి ఉద్యోగులు పైస్థాయి నుంచి వచ్చే ఆదేశాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్యాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారి ఆదేశాలను పాటించకపోతే కక్షసాధింపు చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో కొందరు ఉద్యోగులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులను దుర్భాషలాడుతూ చిన్నా పెద్ద తప్పులని చూడకుండా వారి పై ఇష్టం వచ్చినట్టు కార్యాలయంలో అందరి ముందు కేకలు వేయటం, ఏది ఏమైనా నేను చెప్పింది చేయాల్సిందే లేకుంటే మీకు బతుకు ఉండదు అని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని సిబ్బంది కూడా సదరు ఉన్నతాధికారిపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. **అర్ధనగ్నంగా డ్యూటీ..!** ములుగు జిల్లా రవాణా శాఖ అధికారులకు విధి నిర్వహణలో యూనిఫామ్ నిబంధనలు పక్కన పెడితే కనీసం పూర్తిగా దుస్తులు ధరించకుండా ఒంటిపై బనియన్ తో అర్ధనగ్నంగా ములుగు డీటీఓ కార్యాలయంలో డ్యూటీ చేయటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రవాణా శాఖ కార్యాలయంలో పనిపై పురుషులతోపాటు స్త్రీలు ధ్రువపత్రాల కోసం కార్యాలయానికి వస్తుంటారు. అయితే డ్యూటీ సమయంలో కనీసం సాధారణ దుస్తుల్లోనైనా ఉండాల్సిన అధికారి కార్యాలయంలో యూనిఫామ్ లేకుండా, మర్యాదపూర్వకమైన దుస్తులు కూడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజల తో పాటు సిబ్బంది ముందు అధికారి హోదాకు తగిన విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ బాధ్యత గల కుర్చీలో కూర్చొని బనియన్ పై అర్ధనగ్నంగా డ్యూటీ చేయడం పై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. **‘లాగిన్’ వ్యవహారంపై ఏమైంది.?** ఇటీవల ములుగు రవాణా శాఖలో డీటీఓ లాగిన్ ఐడీ, డిజిటల్ సంతకం వినియోగానికి సంబంధించిన వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. అధికారి విధుల్లో లేని సమయంలో ఆయన పేరుతో డిజిటల్ సంతకాలతో ధ్రువపత్రాలు జారీ అయ్యాయనే ఆరోపణలు ఇప్పటికే ప్రశ్నలను లేవనెత్తాయి. ఈ వ్యవహారంపై సెప్టెంబర్ 2న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) వివరణ కోరినట్లు సమాచారం. అయితే దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేత ధోరణిలో వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు అధికారిక లాగిన్ వివరాలు ఎవరి వద్ద ఉన్నాయి? డిజిటల్ సంతకాన్ని ఎవరు వినియోగించారు? అధికారి విధుల్లో లేని సమయంలో ఆయన పేరుతో ధ్రువపత్రాలు ఎలా జారీ అయ్యాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. **ఉన్నతాధికారుల మౌనం ఎందుకు?** ములుగు రవాణా శాఖ కార్యాలయంపై వరుసగా ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటివరకు సమగ్ర విచారణకు ఆదేశించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. లాగిన్, డిజిటల్ సంతకాల వ్యవహారం నుంచి మొదలుకొని బ్రోకర్ల ద్వారా పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు, డ్రైవింగ్ టెస్టులపై అనుమానాలు, అధికారిపై వస్తున్న ఆస్తుల ఆరోపణలు.. ఇలా అనేక అంశాలు తెరపైకి వస్తున్న నేపథ్యంలో శాఖాపరమైన విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. **‘ఎవరికి వాటాలు..?’** ఇన్ని ఆరోపణలు వస్తున్నా చర్యలు ఎందుకు లేవన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అవినీతి ఆరోపణలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఫిర్యాదులపై విచారణ ఎందుకు జరగడం లేదు? అనే ప్రశ్నలు వాహనదారుల నుంచి వినిపిస్తున్నాయి. ‘అక్రమంగా సంపాదిస్తున్న సొమ్ములో ఉన్నతాధికారులకు కూడా వాటాలు ఉన్నాయా?’ అంటూ జిల్లా ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అనుమానాలకు తెరపడాలంటే ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ములుగు రవాణా శాఖ కార్యాలయంలో జరుగుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలన్నింటిపైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లాగిన్ వినియోగం, డిజిటల్ సంతకాలు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, బ్రోకర్ల వ్యవహారం, దరఖాస్తుల పెండింగ్, అధికారిపై వచ్చిన ఆస్తుల ఆరోపణలు.. ఇలా ప్రతి అంశాన్ని పరిశీలించి తప్పు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**● ఈనెల 15 నుండి 17 వరకు బ్రహ్మోత్సవాలు...**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం కమాన్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోఈనెల 15 నుండి 17 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మంగళవారం రోజున ఆలయ కమిటీ సభ్యులు శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి టెంపుల్ ఆలయ కమిటీ సభ్యులు, విశ్వకర్మ మరియు విశ్వబ్రాహ్మణ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. .మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా , ఘనంగా బ్రహ్మోత్సవాల ను నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీన ప్రారంభమయ్యే ఈ వేడుకలు సెప్టెంబర్ 17 వరకు వివిధ విశేష పూజలు, హోమాలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండుగ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విశ్వబ్రాహ్మణ బంధువులందరూ ఈ దివ్య మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## నేత్రదానం మహాదానం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి..

**నేత్రదానంపై అపోహలను వీడి అవగాహన పెంచుకోవాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం మరియు జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు చెందిన వాసన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన సదస్సు, అవగాహన నడకను నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాన ఉద్యమంలో విశేషంగా సేవలందిస్తున్న నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాసన్ ఐ కేర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్నియల్ బ్లైండ్‌నెస్‌ను తగ్గించేందుకు సమాజం నుంచి మరింత మద్దతు లభించేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రారంభించిన “స్కాన్ & ప్లెడ్జ్” కార్యక్రమాన్ని మేయర్ ప్రశంసించారు. నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించి, నేత్రదానం ద్వారా మరొకరికి చూపును అందించవచ్చనే సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. “నేత్రదానం మహాదానం. మన మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప అవకాశం నేత్రదానం ద్వారా లభిస్తుంది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలి” అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌తో పాటు పొరుగు జిల్లాల్లో కూడా నేత్రదాతల నుంచి కార్నియాలను సేకరించేందుకు వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో 24 గంటలూ, 7 రోజులూ అందుబాటులో ఉండే కార్నియా సేకరణ టెక్నీషియన్ సేవలు అందిస్తున్నారని మేయర్ తెలిపారు. నేత్రదాన ఉద్యమానికి వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మైథిలి, డాక్టర్ టి. హరిత గౌడ్, డాక్టర్ శ్రీలేఖ నేత్రదానానికి సంబంధించిన అపోహలు, అపార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారతదేశవ్యాప్తంగా ఉన్న ఏఎస్‌జీవాసన్ ఐ కేర్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా కొనసాగుతున్న “స్కాన్ & ప్లెడ్జ్” కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, ఎన్జీవో ప్రతినిధులను ముఖ్య అతిథి మేయర్ కొలగాని శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సెంటర్ మేనేజర్ వంశీ, వాసన్ ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరవింద్, సీనియర్ సిబ్బంది కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, నేత్రదాతల కుటుంబ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాత మధు వ్యాఖ్యలకు నిరసన

**కాంపల్లి వద్ద జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకుల భారీ ధర్నా**

**దళితులపై చిన్నచూపు చూస్తున్న బీఆర్ఎస్: ఇస్లావత్ సుధాకర్ నాయక్**



**సీరోలు, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కాంపల్లి గ్రామ సమీపంలోని మహబూబాబాద్‌ఖమ్మం 365 జాతీయ రహదారిపై భారీ ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డుపై బైఠాయించి తాత మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధును శాసనమండలి నుంచి తొలగించాలని కోరారు. దళితులపై బీఆర్ఎస్ చిన్నచూపు చూస్తోందని దళిత వర్గానికి చెందిన వ్యక్తి అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నందుకు బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్రావత్ సుధాకర్ నాయక్ విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామ సర్పంచులు మరియు అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన గణపతి.. మట్టి గణపతి

**పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిద్దాం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. “హమారా ఉన్నత మార్గ్” (హమ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో “మన గణపతి మట్టి గణపతి” అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని సూచించారు. “మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం”అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. “మట్టి గణపతి మహాగణపతి” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంట్లో మట్టితో తయారు చేసిన గణపతిని ప్రతిష్ఠించి పూజించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా వినాయక మండపాల్లో మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులను ప్రోత్సహించేందుకు సంస్థ తరఫున ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నవరాత్రుల్లో ఒక రోజున మట్టి గణపతిని ప్రతిష్ఠించిన మండపాలను సందర్శించి నిర్వాహకులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరిస్తామని వెల్లడించారు. సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్, సంస్థ సభ్యులు తోడుపునూరి తిరుపతి, కరీంనగర్ కార్పొరేషన్ కార్పొరేటర్లు తోట అనిల్, శరత్ చంద్ర, అపర్ణ జితేందర్, దేవసాని సరస్వతి పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్య వ్యాఖ్యలు

**- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి : బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**

**దళిత జాతికి కేసీఆర్ క్షమాపణ చెప్పాలి - మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ డిమాండ్**

**నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చి మహిళా కానిస్టేబుల్ ముందు దుస్తులు విప్పడం దారుణం - బిఆర్ఎస్ డ్రామాపై ఫైర్**

**స్పీకర్ ను కించపరిస్తే సహించం - తాతా మధుపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలి : అంజన్ కుమార్**

**కాంగ్రెస్ లోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గౌరవం - బీజేపీ, బిఆర్ఎస్ లు కుల వివక్ష పార్టీలు : బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 8(పిసి డబ్ల్యూ న్యూస్):** నిన్న హైదరాబాద్ అసెంబ్లీ వద్ద శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్యకర, అభ్యంతరకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. ఈరోజు కరీంనగర్ లోని ఆర్ ఎండ్ బి అతిథి గృహంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ లింగంపల్లి బాబు తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ…" ఒక పక్క భారతీయులు టెక్నాలజీ పరంగా తమ మేధో శక్తితో దేశానికి గర్వకారణంగా నిలుస్తుంటే, మరో పక్క బీఆర్ఎస్ నాయకులు 500 ఏళ్ల నాటి కుల వివక్షను మళ్లీ చూపిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల మీడియా ముందు చెప్పలేని అసభ్య పదజాలంతో దూషించడం సిగ్గుచేటు. నేడు కూడా అసెంబ్లీలోకి వచ్చి అదే అహంకారంతో ప్రవర్తించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. రెండున్నరేళ్లు ప్రతిపక్షంలో ఉండగానే బీఆర్ఎస్ నాయకులకు సహనం నశించింది. ప్రజలు వారిని ప్రతిపక్షానికి పరిమితం చేసిన తీర్పును వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో అసెంబ్లీని కేవలం 48 రోజులు, 36 గంటలు మాత్రమే నడిపి ప్రతిపక్ష గొంతు నొక్కిన చరిత్ర వారిది. ఒక దళిత నాయకుడు సీఎల్పీ లీడర్ గా ఉన్నారని జీర్ణించుకోలేక వారి ప్రభుత్వ హయాంలో సీఎల్పీ ని ముక్కలు చేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నేత లేకుండా చేశారు. దళితులకు 3 ఎకరాల భూమి, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ ది. నిన్న అసెంబ్లీ ముందు జరిగిన డ్రామా అంతా కెసిఆర్ ఫామ్ హౌస్ లో వేసిన స్కెచ్ ప్రకారమే జరిగింది. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ముందు పెట్టుకుని డ్రామాలు చేసే నీచ రాజకీయం కే చెల్లుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, దానిని జీర్ణించుకోలేక ప్రజల నుండి వస్తున్న స్పందన ను ఓర్వలేక ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే పథకం ప్రకారం వచ్చారు. కానీ వారి పథకం బెడిసికొట్టింది. 4 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన వారికి అసెంబ్లీకి నల్ల దుస్తులతో రాకూడదని తెలియదా? నల్ల దుస్తులు బయట నిరసనకు వేసుకోవాలి, ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీలోకి కాదు. అది తప్పు అని చెబితే మహిళా కానిస్టేబుల్ ముందు దుస్తులు విప్పేసి ఇబ్బంది పెట్టడం అత్యంత దారుణం, అహంకారపూరిత చర్య. ఇదంతా రికార్డ్ అయి ఉంది. ఈ సమావేశంలో కార్పొరేటర్ వరాల నరసింగం, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అహమ్మద్ అలీ, కాంగ్రెస్ నాయకులు జీడి రమేష్, చింతల కిషన్, మాదాసు శ్రీనివాస్, బొమ్మరాతి సాయికృష్ణ, కూడలి శ్రీధర్, తిరుపతి, ముద్దసాని క్రాంతి, పెంట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహణ



**కరీంనగర్, సెప్టెంబర్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నవ భారత సాక్షరత కార్యక్రమంఉల్లాస్లి ఫోర్ట్‌నైట్ వేడుకల్లో భాగంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలోలి నిర్వహించారు. భాగంగా విద్యార్థులలో అక్షరాస్యత, విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు లిఅవగాహన ర్యాలీలి నిర్వహించారు. విద్యార్థులకు లివ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు క్లాత్ బ్యాగులను పంపిణీలిచేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ లిచాక్లెట్లను కూడా పంపిణీలి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను సత్కరించడంతో పాటు, వ్యాసరచన పోటీల నిర్వహణలో సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బందిని కూడా అభినందించారు. విద్య, అక్షరాస్యత వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ పురోగతికి కూడా ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో లికరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మైదం శివకాంత్ పటేల్, బట్టు వినోద్, ఐత సూరజ్, సీనియర్ సభ్యుడు సింగం రాజులి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లివయోజన విద్య, జిల్లా విద్యాశాఖ, SERP`DRDA మరియు వీజ్రూహీూ, కరీంనగర్‌లి వారి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. లివిద్యతో సాధికారత అక్షరాస్యతతో సమాజాభివృద్ధిలి అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రశ్నించే గొంతులపై పోలీసు పిడికిలి దుర్మార్గం

- **హామీలు అమలు చేయమంటే దాడులా?**
- **ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు లేదా?**
- **బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి తీవ్ర ఆగ్రహం**



**వైరా ప్రతినిధి, సెప్టెంబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు అని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై పోలీసులతో దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని వైరా నియోజకవర్గం, జూలూరుపాడు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలులో విఫలమవుతోందని ఆయన ఆరోపించారు. ఇచ్చిన మాటలను గుర్తు చేస్తూ, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతులను అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు నాయకత్వంలో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, శాసనమండలిలోని ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార పక్షాన్ని ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షాలపై ఉంటుందని, ప్రజల సమస్యలను సభల దృష్టికి తీసుకెళ్లే నాయకులనే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజల తరఫున నిలబడి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడమే తప్పయితే, ఇక ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కుకు విలువ ఏముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో పాటు ఇతర నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత అభ్యంతరకరమని చాపలమడుగు రామ్మూర్తి అన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి తదితరుల పట్ల జరిగిన వ్యవహారాన్ని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు డిక్లరేషన్ల పేరుతో ప్రకటించిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆ ప్రశ్నలకు జవాబు చెప్పకుండా, ప్రశ్నించే వారిపైనే పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజల అనుమానాలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అడగడం తప్పు కాదు" అని రామ్మూర్తి స్పష్టం చేశారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పోలీసు నిర్బంధంతో అణచివేయాలని ప్రయత్నిస్తే అది ప్రభుత్వానికి మరింత నష్టం కలిగిస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసి ఉద్యమాలను అడ్డుకోవచ్చని ప్రభుత్వం భావిస్తే అది పొరపాటేనని హెచ్చరించారు. ప్రజల కోసం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి చర్యలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులపై జరిగిన ఘటనలకు బాధ్యులైన వారు ప్రజలకు, ప్రతిపక్ష నాయకులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చాపలమడుగు రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇల్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారంటూ కొడుకు ఆవేదన

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా..**


**పెట్రోల్‌తో ఆత్మహత్యాయత్నం కలకలం**














**కల్లూరు, సెప్టెంబరు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తన తండ్రికి చెందిన ఇంటిని తన అక్కకు అక్రమంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ ఓ కుమారుడు కుటుంబ సభ్యులతో కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన ఘటన ఖమ్మం జిల్లా కల్లూరులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తల్లాడ మండలం కలకోడిమ గ్రామానికి చెందిన ఆదూరి యేసు దంపతులకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెలు మృతిచెందగా, ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఆదూరి వెంకటేశ్వర్లు, కోడలు విజయ కొంతకాలంగా గ్రామంలో ఉండకుండా వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. దీంతో వృద్ధుడైన యేసు కొంతకాలంగా తన కుమార్తె బొల్లిపోగు నాగమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో తన తండ్రి యేసు ఈ ఏడాది మే 22న తన ఇంటిని కుమార్తె నాగమ్మకు గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారని వెంకటేశ్వర్లు ఆరోపించారు. అయితే రిజిస్ట్రేషన్ జరిగిన రోజే యేసు మృతిచెందారని తెలిపారు. తన అక్క ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఆలస్యంగా తెలుసుకున్న వెంకటేశ్వర్లు.. కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ ఏర్పాటు చేసి తనకు తండ్రి ఇల్లు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అయితే తనకు ఇల్లు ఇవ్వబోమని, ఎక్కడైనా దిక్కున్న చోట చెప్పుకోండని అన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పెద్దల సూచనలను కూడా పట్టించుకోకుండా తమపై ఇష్టారాజ్యంగా మాట్లాడారని ఆరోపించారు. దీంతో న్యాయం కోసం మంగళవారం ఉదయం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్న వెంకటేశ్వర్లు.. "నా తండ్రికి నేనే కుమారుడిని. నా తండ్రి ఇంటిని నా అక్కకు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు?" అంటూ అధికారులను ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద వేచి ఉన్నప్పటికీ సరైన సమాధానం లభించలేదని ఆరోపిస్తూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ క్రమంలో తీవ్ర ఆవేదనకు గురైన బాధిత కుటుంబ సభ్యులు తమకు ఆస్తి, తలదాచుకునే చోటు లేకుండా పోయిందని పేర్కొంటూ పెట్రోల్‌తో ఆత్మహత్యకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వారిని అడ్డుకుని శాంతింపజేశారు. అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు. తమ తండ్రి ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి ఆస్తిని తమకు అప్పగించాలని వారు విజ్ఞప్తి చేశారు. అయితే కార్యాలయాల్లో ఆందోళనలు చేయడం, అధికారుల విధులకు ఆటంకం కలిగించడం సరికాదని పోలీసులు సూచించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాల పరిశీలన అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# తాతా మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసన..



**రామడుగు, సెప్టెంబర్08(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ శాసనసభ గౌరవాన్ని, గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదవి ప్రతిష్ఠను కించపరిచే విధంగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలకు నిరసనగా రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామడుగు మండల పోలీస్ స్టేషన్లో ఎస్సై రాజు కు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసునమోదైందిచేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, కడే శంకర్ యూత్ కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షులు అనుపురం పరుశురాం గౌడ్, సర్పంచులు. గుమ్మడి మల్లేష్, మొయిజ్, నునుగొండ అశోక్ మనీష్, బాల గౌడ్, బద్దం లక్ష్మారెడ్డి, సిరికొండ రాజుఎలుక పెళ్లి లచ్చయ్య, జక్కుల బాబు, ఆరిఫ్ శేఖర్, కత్తి మధు, ఈశ్వర్, భువన్ గౌడ్, స్వామి, దిలీప్, అనిల్, శీను, రాజు, రాజేందర్, జబ్బర్,కనకయ్య, రామ్ రెడ్డి, మాధవరెడ్డి,ఎల్లయ్య,తడగొండ లక్ష్మణ్, హనుమంతు, నర్సింగ్ బాబు, మల్లేశం, రవి, పోచయ్య, వెంకటేష్ మాణిక్యం, మార్కెట్ కమిటీ పాలకవర్గం, సింగిల్ విండో పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతితులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండియాతో చారిత్రాత్మక పోరుకు
# జపాన్ జట్టు ప్రకటన



ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది. మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

## రూమర్లకు చెక్ పెట్టిన
# రాహుల్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



# భారత్‌ను చూసి నేర్చుకోండి




### ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# 27న పింక్ పవర్ రన్



### • పాల్గొననున్న 20 వేల మంది రన్నర్లు

**హైదరాబాద్ :** ఈ నెల 27న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరుగనుందని నిర్వాహకులు ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి వెల్లడించారు. ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింక్ పవర్ రన్ మూడో ఎడిషన్‌లో సుమారు 20 వేల మంది రన్నర్లు పోటీపడతారని, రూ.75 లక్షల భారీ నగదు బహుమతి అందించనున్నారు. పింక్ పవర్ రన్‌లో తొలిసారి హాఫ్ మారథాన్ (21.097 కిమీ) నిర్వహించనున్నారు. 10కె, 5కె, 3కె ఈవెంట్లు సైతం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో 2025 మిస్ వరల్డ్ ఒపల్ సుచతా చువాంత్, రొమ్ము క్యాన్సర్ సర్జన్ డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటితో కలిసి సుధా రెడ్డి పింక్ పవర్ రన్ జెర్సీ, మెడల్స్ ఆవిష్కరించారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖరైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు.



బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



## చిరు కూతురు 'అమ్ములు'గా అనశ్వర..

### 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కాకా' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో చిరంజీవి కూతురిగా నటిస్తున్న మలయాళ నటి అనశ్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'అమ్ములు' పాత్రను పరిచయం చేస్తూ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.విడుదలైన పోస్టర్‌లో అనశ్వర రాజన్ మెడికల్ కాలేజీ విద్యార్థినిగా అమాయకమైన లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఆమె నవ్వుతూ కనిపిస్తుండగా, వెనుక రక్షణ కవచంలా మెగాస్టార్ చిరంజీవి నీడ కనిపిస్తోంది. ఈ పోస్టర్ కూతురి జీవితంలో తండ్రి ప్రాముఖ్యతను, వారి మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని తెలియజేసేలా ఉంది. సినిమాలో ఆమె పాత్ర కథాగమనంలో చాలా కీలకమని చిత్ర యూనిట్ పేర్కొంది.తన సహజ నటనతో మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ సినిమాలో అత్యంత ముఖ్యమైన పాత్రను దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది.

బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా జరుగుతోంది. తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో పాటు మాస్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు

## చరిత్రలో తొలిసారి..

### ఢిల్లీ దాటుతున్న జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక




జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం విషయంలో దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయానికి ఈ ఏడాది తెరపడనుంది. చరిత్రలో తొలిసారిగా ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను దేశ రాజధాని ఢిల్లీ నుంచి తరలిస్తున్నారు. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉన్న ప్రదేశం ఇదే కావడం గమనార్హం.

ఈ నెలలో గుజరాత్ పర్యటనకు వెళ్లనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడే అవార్డులను ప్రదానం చేస్తారని తెలుస్తోంది. పర్యటనలో భాగంగా ఆమె ఏక్తా నగర్‌కు వెళ్లి విజేతలకు పురస్కారాలు అందజేయనున్నట్టు సమాచారం. సాధారణంగా ఏటా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. అయితే, ఈసారి అందుకు భిన్నంగా వేదికను మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది.

2024 సంవత్సరానికి గాను 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను జులై నెలలో ఢిల్లీలో ప్రకటించారు. 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా నిలవగా, యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి, బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. కాగా, 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ – ఏక్తా కా ప్రతీక్' అనే చిత్రానికి గాను దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ నాన్-ఫీచర్ విభాగంలో ఉత్తమ దర్శకత్వ పురస్కారం అందుకోవడం విశేషం.



## చీరకట్టులో ఆకట్టుకుంటున్న ఆషికా రంగనాథ్..

కన్నడ నటిగా పాపులారిటీ అందుకున్న ఆషికా రంగనాథ్ తొలిసారి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా వచ్చిన అమీగోస్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. సినిమా డిజాస్టర్ గా నిలిచినా అందరి దృష్టి అమ్మడి పైనే. తన నటనతో, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. మళ్లీ 2026లో భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటించింది . ఈ సినిమా కూడా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర అనే సినిమా చేస్తోంది. కానీ ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. దీంతో రూట్ మార్చిన ఈమె.. తమిళంలో తాజాగా నటిస్తున్న చిత్రం సర్దార్ 2 . సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో అటు ప్రమోషనల్ కార్యక్రమాలతో పాటు ఇటు సోషల్ మీడియా వేదికగా సందడి చేస్తూ అలరిస్తోంది. ఈ మేరకు తాజాగా చీరకట్టులో ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఆషికా రంగనాథ్. బ్లాక్ అండ్ వైట్ జీబ్రా కలర్స్ తో డిజైన్ చేసిన జార్జెట్ చీర కట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో పోల్కా డాటెడ్ తో డిజైన్ చేసిన డీప్ రౌండ్ నెక్ కలిగిన బ్లౌజ్ ధరించి తన అందాలను ఫుల్ ఫిల్ చేసుకుందిహైదరాబాదులో సెప్టెంబర్ 7న జరిగిన సర్దార్- 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఇలా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. చీర కట్టులో నడుము అందాలతో చక్కగా ప్రేక్షకులను మైమరిపింప చేసిన ఆషికా రంగనాథ్ ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సినిమాటిక్ గా ఉందా? హైదరాబాదులో సర్దార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం ఈ లుక్ అంటూ షేర్ చేసిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మొత్తానికి అయితే ఆషికా రంగనాథ్ షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ప్రీ రిలీజ్ ఈవెంట్లో తన అంద చందాలతో ఆషికా ఆకట్టుకున్న విషయం తెలిసిందే

పిఎస్ మిత్రాన్ దర్శకత్వంలో గతంలో వచ్చిన సర్దార్ మూవీకి సీక్వెల్ గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తమిళ్ భాష స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రాబోతున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మించారు. ఇందులో కార్తీ సరసన రజీషా విజయన్ తన మునుపటి పాత్రనే తిరిగి పోషిస్తుండగా.. మాళవిక మోహనన్.. ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో అదనంగా చేరారు.. ఈ చిత్రానికి సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా .. జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ అందించారు. విజయ్ వెళకుట్టి ఎడిటింగ్ నిర్వహించారు. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 10న రాబోతున్న ఈ సర్దార్ 2.. సర్దార్ కు మించి సక్సెస్ అందుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## 75 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్ ఐకాన్..

### మమ్ముట్టి యంగ్ లుక్



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సెప్టెంబర్ 7న 75వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్, యంగ్ లుక్ చూసి సినీ పరిశ్రమ, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. కండరాల బలం, శారీరక చురుకుదనం సహజంగా తగ్గే వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటం వెనుక ఒక క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, క్రమం తప్పని వ్యాయామం, సరైన నిద్ర వంటి అలవాట్లే ఆయన ఫిట్‌నెస్ రహస్యాలుగా తెలుస్తోంది.

**సూర్యకు స్ఫూర్తినిచ్చిన మమ్ముట్టి**

తమిళ స్టార్ హీరో సూర్య సైతం మమ్ముట్టి ఆహారపు అలవాట్ల నుంచి స్ఫూర్తి పొందినట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. "ఇష్టమైనది ఏదైనా తినొచ్చు, కానీ ఇష్టమొచ్చినంత తినకూడదు, కడుపు సగం నిండే వరకే తినాలి" అని మమ్ముట్టి తనకు సలహా ఇచ్చినట్లు సూర్య గుర్తుచేసుకున్నారు. పూర్తిగా మానేయడం కంటే, పరిమితంగా తినడమే మమ్ముట్టి డైట్‌లో కీలక సూత్రం.

**డైట్ ప్లాన్ ఎలా ఉంటుంది?**

కొన్ని నివేదికల ప్రకారం, మమ్ముట్టి నూనెలో వేయించిన పదార్థాలకు, చక్కెర, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉంటారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు, నట్స్ వంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం అల్పాహారంలో ఓట్స్ జావ, గుడ్డులోని తెల్లసొన, బొప్పాయి, నానబెట్టిన బాదం వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం అన్నానికి బదులుగా ఓట్స్ పుట్టుతో పాటు తక్కువ మసాలాతో వండిన చేపల కూర తింటారు. రాత్రిపూట గోధుమ లేదా ఓట్స్ దోశలతో చికెన్ లేదా చేపల కూర తీసుకుని, తేలికపాటి ఆహారంతో సరిపెడతారు. ఆయన వ్యక్తిగత చెఫ్ చెప్పిన ప్రకారం, వేయించిన చేపల కంటే చేపల పులుసునే ఆయన ఇష్టపడతారు.

**వ్యాయామం, నిద్రకు అధిక ప్రాధాన్యం**

ఆహార నియమాలతో పాటు, మమ్ముట్టి రోజూ జిమ్‌లో వర్కౌట్లు చేస్తారు. వయసు పెరిగేకొద్దీ కండరాల బలం తగ్గకుండా ఉండేందుకు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో వ్యాయామాలు చేస్తుంటారు. ఫిట్‌నెస్ విషయంలో వ్యాయామం ఎంత ముఖ్యమో, శరీరానికి సరైన విశ్రాంతి కూడా అంతే అవసరమని ఆయన నమ్ముతారు. అందుకే, షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నా, సరైన సమయానికి నిద్రపోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు.

మమ్ముట్టి 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం 'మేళా' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఒకవైపు నటుడిగా రాణిస్తూనే, మరోవైపు ఆరోగ్యకరమైన జీవనశైలితో ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

## పిఠాపురంలో అలా మొదలైంది..

### మళ్లీ ఫ్యామిలీ కథతో మహేష్ చంద్ర



ప్రేయసి రావే సినిమాతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహేష్ చంద్ర ఇప్పుడు మరో ఫ్యామిలీ కథతో వస్తున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన పిఠాపురంలో అలా మొదలైంది సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తోంది. టైటిల్ నుంచే కథకు పిఠాపురం నేపథ్యం ఉందని అర్థమవుతోంది. ప్రేమ, కుటుంబం, సరదా సన్నివేశాలతో పాటు తండ్రి, కూతురు మధ్య అనుబంధం ఈ కథలో ముఖ్యంగా ఉండబోతోంది. 00:05 / 02:25 రాజేంద్ర ప్రసాద్ ఇందులో కీలక పాత్రలో నటించారు. పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మతో పాటు సన్నీ అఖిల్, విరాట్, జూనియర్ పవన్ కల్యాణ్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇతర




పాత్రల్లో కనిపించనున్నారు. ఒక కుటుంబంలో మనకు రోజూ ఎదురయ్యే మనుషులు, పరిస్థితులకు దగ్గరగా పాత్రలను రాసినట్టు దర్శకుడు చెబుతున్నారు. ఇప్పటి యువతకు చెప్పాల్సిన ఒక విషయాన్ని కూడా కథలో భాగంగా తీసుకున్నారట. మహేష్ చంద్ర పేరు చెప్పగానే చాలామందికి ప్రేయసి రావే గుర్తుకొస్తుంది. ప్రేమకథతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ తో వచ్చిన ఆ సినిమా అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు కూడా ఆయన పూర్తిగా కుటుంబ కథనే ఎంచుకున్నారు. కాకపోతే ఈసారి తండ్రి, కూతురు బంధాన్ని కథలో హైలెట్ చేశారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కూడా ఇంట్లో జరిగే సరదా గొడవలు, పెళ్లి చుట్టూ వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.